క్లుప్తంగా

ఆర్టీసీ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి



ఆర్టీసీ పథకాలను వివరిస్తున్న అధికారులు

కథలాపూర్: ఆర్టీసీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరుట్ల డిపో అధికారులు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని బొమ్మెన గ్రామంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న రాయితీ పాసులు, విద్యార్థులకు అందిస్తున్న రాయితీ పాసుల గురించి వివరించారు. విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను తక్కువ రేట్లకు అద్దెకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు లావణ్య, కోరుట్ల డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటేశం, కంట్రోలర్ కిషన్‌రావు, తిరుపతిరెడ్డి, గట్ల గంగాధర్, బాపురెడ్డి, రాజబోస్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతి ప్రదానం చేస్తున్న సర్పంచ్

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు సర్పంచ్ వనతడుపుల అంజయ్య బహుమతి ప్రదానం చేశారు. ఎంపీటీసీ చిట్నేని లత, ఉపసర్పంచ్ సంకె రాకేశ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల సాధనకు ఏకం కావాలి

మల్యాల: యాదవ హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి రావాలని అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు, గుడిపేట సర్పంచ్ గొట్టె హన్మండ్లు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని నియమించి, యాదవుల డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం యాదవులు ఏకం కావాల్సి సమయం ఆసన్నమైందన్నారు. త్వరలో అఖిల భారత యాదవ మహాసభ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించి, హక్కుల సాధనకు కార్యాచరణ రూపొందిస్తామని గొట్టె హన్మండ్లు పేర్కొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్‌కేఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. ఈ మేరకు శనివారం కళాశాల స్థాయి పోటీలు నిర్వహించారు. అనంతరం అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. అధ్యాపక బృందం ఎలిజబెత్‌రాణి, గోవర్దన్, రాధాకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల హంగామా

జగిత్యాల: జగిత్యాలలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో కళాశాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ మునిపట్ల రాజేందర్, మల్లేశం గౌడ్, ప్రిన్సిపల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా బైరి గంగారాం, ఉపాధ్యక్షుడిగా తాళ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా సామల్ల మహేశ్, కోశాధికారిగా సామల్ల రమేశ్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పశువైద్య శిబిరం

మేడిపెల్లి: బీమారం మండలం గోవిందారంలో శనివారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆవులకు, గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసి, నట్టల మందులు, సూది మందులు అందజేశారు.

నాట్యమయూరి ఆముక్త మాల్యద

- భరతనాట్యంలో వందకుపైగా ప్రదర్శనలు
- తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో నాట్య ప్రదర్శన
- వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం



బాసరలో గంగాహారతి సందర్భంగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆముక్త మాల్యద (ఫైల్)

కోరుట్లరూరల్: పట్టణానికి చెందిన బీర్నంది నర్సింహాచారి–కావ్యశ్రీ దంపతుల కూతురు ఆముక్త మాల్యద భరతనాట్యంలో దిట్ట. నాలుగో తరగతి చదువుతున్న రోజుల్లోనే భరత నాట్యంపై మక్కువ పెంచుకుంది. కోరుట్లకు చెందిన భరతనాట్య శిక్షకులు పిన్నంశెట్టి మధు వద్ద ఆముక్త మాల్యద భరతనాట్యం నేర్చుకుంది. అదే సంవత్సరం పట్టణంలోని పాఠశాలలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చి మంచి గుర్తింపు సంపాదించింది. అప్పటినుంచి మండల, జిల్లా స్థాయిలో ఎన్నో ప్రదర్శలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మద్రాస్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పిన్న వయసులోనే వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. ఆముక్త మాల్యద తనదైన శైలిలో ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.

అవార్డులు, ప్రశంసాపత్రాలు..



నృత్యం చేస్తున్న ఆముక్త మాల్యద

- మొట్ట మొదటిసారి 2014లో విజయవాడలో జరిగిన సిలికాన్ ఆంధ్రా 4వ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం, పురస్కారం అందుకుంది. అదే సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించిన జయజయహే తెలంగాణ జననీ జయ కేతనం అనే గీతానికి కీర్తనం చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించింది. 2019లో ఉత్తరప్రదేశ్‌లోని కాశీలో బనారస్ హిందూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొని నాట్యరవళి అవార్డును పొందింది. 2020లో తమిళనాడులోని గౌరివక్కం యూనివర్సిటీలో తమిళనాడు ప్రభుత్వం టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ భరతనాట్యం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం అందుకుంది. అదేవిదంగా 2020లో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆముక్త మాల్యదకు నాట్యమయూరి అవార్డును ప్రదానం చేశారు. ఇలా అతి చిన్న వయసులోనే ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకుంటున్న ఆముక్త మాల్యద ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూనే అవకాశాలు వచ్చినపుడు ప్రదర్శనలు ఇస్తోంది.



బనారస్ యూనివర్సిటీ అవార్డుతో ఆముక్త మాల్యద

అటెన్షన్ ప్లీజ్



మరమ్మతుకు నోచుకునేదెన్నడు?

బుగ్గారం: ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామంలో గల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లో ఓల్టేజీని అధిగమించడానికి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న గతంలో మూడు చిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కాగా అందులో ఒకటి పూర్తిగా పాడైంది. దీంతో లో ఓల్టేజీ సమస్య ఏర్పడి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని నివారించడానికి స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చి సిద్ధంగా ఉంచారు. అయినప్పటికీ నెలలు గడుస్తున్నా బిగించడానికి అధికారులు రావడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అలాగే తమ గ్రామంలో లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ సేవలు ప్రజలకు అందడంలో తీవ్ర ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు తక్షణమే స్పందించి తమ గ్రామంలో సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : మనోహర్, విద్యుత్‌శాఖ, ధర్మపురి
ఫోన్ నంబర్ 94408 11469

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు పట్టణంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆనందరావు, బాలె శంకర్, బండారి నరేందర్, ప్రశాంత్, హరీశ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్స

నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 36 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు.కార్యక్రమంలో గోపి అరవింద్ పాల్గొన్నారు.

జీవో సర్వీస్ బదిలీలకు అనుమతి ఇవ్వాలి

జగిత్యాల: పైరవీ బదిలీలు ఆపాలని, జీవో సర్వీస్ బదిలీలకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు కలెక్టరేట్ ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలు నిలిపివేయాలన్నారు. బదిలీల్లో కనీస సర్వీస్ నిబంధన తొలగించాలని, మిగిలిన ఎస్జీటీ, ఎల్ఫ్ స్పౌజ్ బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు తావులేకుండా బదిలీలు పారదర్శకంగా జరపాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, బోగ రమేశ్, గంగాధర్, శంకర్, భూమేశ్వర్, రాంచందర్, నరేందర్, రఘుపతియాదవ్, శివకృష్ణ, కృష్ణమాచారి, ప్రసాద్, మురళి, రేచల్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విపత్తులపై అవగాహన

ఇబ్రహీంపట్నం: విపత్తులు సంభవించినప్పుడు తమను తాము ఎలా రక్షించుకోవాలనే అంశంపై ఎన్డీఆర్‌ఎఫ్ –10వ బెటాలియన్ అధికారి నాగేశ్వర్‌రావు అవగాహన కల్పించారు. ఎర్దండి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సదస్సు నిర్వహించారు. ఆకస్మిక వరదలు, పిడుగుపాట్లు, శత్రువు దాడి, అగ్నిప్రమాదాలు తదితర విపత్తుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్డీఆర్‌ఎఫ్ టిస్త్ కమాండర్ టీహెచ్ బిబితిన్‌సింగ్, తహసీల్దార్ మహేశ్వర్, మెట్‌పల్లి అగ్నిమాపక అధికారి మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాగేశ్వర్‌రావు

ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం



ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో అనైత్య ఎడ్యుకేషన్ సొసైటీ వారు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతి ఒక్కరికి ఉండాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు.

దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీని మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం నియమించారు. ఈ మేరకు కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ అధ్యక్షుడిగా మార్గం సతీశ్, కమిటీ సభ్యులుగా పాకాల నరేశ్, చింతల శివకుమార్, జక్కుల లస్మయ్య, జక్కుల మహేందర్‌ను నియమించారు. ఎంపీటీసీ పాడేటి సత్తయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పాడేటి రవి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు తొగిటి ప్రభాకర్, కటకం రమేశ్, సతీశ్, మల్లయ్య, సత్తయ్య, చంద్రయ్య, సింహాచలం, రాజయ్య పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగనున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఈశ్వర్‌ను శనివారం ఆహ్వానించారు. 2న రాత్రి జరిగే స్వామివారి తిరుక్కల్యాణంలో పాల్గొనాలని మంత్రిని కోరుతూ ఆహ్వానం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు వీరేశం, మోహన్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



సారంగాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



కోరుట్ల: సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ శివారుల్లోని కొండపై వెలసిన శ్రీసూర్యభగవానుడి ఆలయం వద్ద రథసప్తమి సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. ప్రస్తుతం స్వామివారు వెలసిన చోట ఆలయం నిర్మాణం చేయాలని గ్రామస్తులు ప్రతిపాదించారు. కాగా ప్రతి రథసప్తమి పండగకు గ్రామస్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఆలయ చైర్మన్ చిక్కుల రమేశ్, ఉపసర్పంచ్ పూడూరి రమేశ్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

కోరుట్ల: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయంలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. అర్చకులు బీర్నంది నరసింహాచారి, ఈవో విక్రమ్, అర్చకులు శ్రీనివాసాచారి, శ్రీనివాసాచారి, ఆండాల్ గోష్టి బృందం పాల్గొన్నారు.

సూర్యనారాయణ ఆలయంలో..

రాయికల్: పట్టణంలో రథసప్తమి సందర్భంగా చెన్నకేశవనాథ ఆలయంలో శనివారం సూర్యనారాయణస్వామికి అర్చకులు సతీశ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో శనివారం భీమన్న జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో సర్పంచ్ కడకుంట సాయికుమార్, ఎంపీటీసీ మైన లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ఆదివాసి నాయకపోడు సేవాసంఘం అధ్యక్షులు రమేశ్, రాములు, ఉపసర్పంచ్ నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



దైవదర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామితోపాటు అనుబంధ ఆలయాల్లోనూ శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. మాఘమాసం, రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి



పంటపొలాల్లో విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల చైతన్య ఈటెక్నో స్కూల్ విద్యార్థులు సస్యభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సచిన్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని, ఇందులో భాగంగానే గ్రామాల్లోని పంటపొలాల్లో పర్యటించి వివరించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వంశీకృష్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలలో నాణ్యమైన విద్యనందించాలి

ధర్మపురి: మైనార్టీ బాలికల గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ అధినేత కార్యదర్శి షఫీయుల్లా ఐఎఫ్‌ఎస్ ఆదేశించారు. ధర్మపురిలో కొత్తగా ఏర్పాటైన మైనార్టీ గురుకుల కళాశాలను శనివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను భోజనశాల, వంట గదులు, స్టాక్ రూం, రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. అధ్యాపకులు నేర్పుతున్న పాఠ్యాంశాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల కళాశాలలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రానున్న వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థినుల్లో ప్రేరణకు కృషి చేయాలని అధ్యాపకులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజిదబాను అధ్యాపక బృందం ఉన్నారు.



మాట్లాడుతున్న అధికారి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



బిక్షాటన చేస్తున్న ఏబీవీపీ నాయకులు



కోరుట్లలో..

జగిత్యాల: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్‌లో బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.5300కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ గురించి హైకోర్ట్ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. నగర జోనల్ ఇన్‌చార్జి అంజి, వినయ్, మధు, నిఖిల్ పాల్గొన్నారు.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల: రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు శనివారం పట్టనంలో బిక్షాటన చేశారు. కార్గిల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు దుకాణాల్లో బిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మాడవేని సునీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక, అవినీతి, అసమర్థ పాలనను వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.5300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి పవన్, వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, మహదేవ్, ప్రణయ్, శివ, వినయ్, సూరజ్, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ రజక సంఘం కార్యవర్గం

కోరుట్ల: రజక సంఘ పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మనపెల్లి శంకర్, ఉపాధ్యక్షుడిగా మునిగంటి రాములు, కోశాధికారిగా కొమ్మనపెల్లి గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా నిమ్మల గంగాధర్, గొల్లపెల్లి నాగరాజు, బొరుగల్ల రాజేశ్, లస్మయ్యను ఎన్నుకున్నారు.

✦ కల్యాణ మండపానికి భూమిపూజ

మెట్‌పల్లి: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపానికి శనివారం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. జీఎస్ వెంకట్, ఆకుల శ్రీనివాస్, రాజారెడ్డి, మహేశ్, అర్గుల్ రాజేందర్ ఉన్నారు.

✦ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి: మండలంలోని మారుతీనగర్ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మారు చిన్న హన్మాండ్లు(53) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం కోనరావుపేటకు చెందిన హన్మాండ్లు శుక్రవారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో మారుతీనగర్ శివారులో ఎదురుగా ఎదులాపురం సాగర్ అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ హన్మాండ్లును వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

✦ శివాలయం అభివృద్ధికి కృషిచేస్తాం

ధర్మపురి: శివాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సేవా సమితి పక్షాన తమవంతు కృషి చేస్తామని శివసాయి గణేశ్ సేవా సమితి అధ్యక్షుడు పోటిబండ్ల శ్రీరామమూర్తి తెలిపారు. ఈ మేరకు మండలంలోని రాయపట్నం గోదావరి ఒడ్డున నూతనంగా నిర్మించిన శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ బొప్పు వెంకటేశ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. కాగా శనివారం టోర్నమెంట్ పూర్తికాగా ప్రథమస్థానంలో హనుమాన్ జట్టు, ద్వితీయస్థానంలో నిలిచిన శివాలయం జట్టుకు సర్పంచ్ ఈర్ల చిన్నక్క మొండయ్య షీల్డ్ ప్రదానం చేశారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన శివసాయి గణేశ్ సేవాసమితి అధ్యక్షుడు శ్రీరామమూర్తి క్రికెట్ యూత్‌కు రూ.6వేల విలువ గల కిట్ అందజేశారు. ఆలయంలో నూతనంగా చేపడుతున్న షెడ్డు నిర్మాణానికి తమవంతుగా రూ.మూడున్నర లక్షలు విరాళంగా అందిస్తామని ప్రకటించారు.